క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం



గన్నవరం: ప్రజలందరి సంపూర్ణ మద్దతుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వరుసగా రెండోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జూన్ 4వ తేదీన జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌లో వైఎస్సార్ సీపీ మెజార్టీ స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. మచిలీపట్నం ఎంపీగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, గన్నవరం ఎమ్మెల్యేగా డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అఖండ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా కౌంటింగ్ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులందరూ సంయమనంతో వ్యవహరించాలని కోరారు. సెక్షన్ 144 అమలులో ఉన్నందున శాంతిభద్రతల పరిరక్షణకోసం పోలీస్ శాఖకు సహకరించాలని పేర్కొన్నారు.

ప్రశాంతంగా డీవైఈఓ పరీక్షలు

నున్న(విజయవాడరూరల్): వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాలకు రాత పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షకు 130 మందికి గాను 79 మంది హాజరయ్యారు.

ముగిసిన వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు




తోట్లవల్లూరు: స్థానిక రుక్మిణీ సత్యభామాస మేత శ్రీవేణుగోపాలస్వామి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ నెల 17న ప్రారంభమైన స్వామి వారి ఉత్సవాలు తొమ్మిది రోజులపాటు వేడుకగా సాగాయి. ఉత్సవాల చివరి రోజైన శనివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు రెండు వేల మంది గ్రామస్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. రాత్రికి పవళింపుసేవతో కార్యక్రమాలు ముగిశాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి హరిదుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి, ఆలయ అర్చకుడు పీతాంబరం విజయకుమార్ ఆచార్యులు ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఉత్తమ విద్యార్థికి నగదు ప్రోత్సాహకం



కురుమద్దాలి(పామర్రు): గ్రామానికి చెందిన ఎన్‌బీ పూర్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ఫండ్ సౌజన్యంతో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థికి శనివారం నగదు బహుమతిని అందజేశారు. ఫండ్ అధినేత ఆముదాలపల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పెనమలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతిలో 574 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఇంటూరి లీలా తన్మయ్‌ను అభినందిస్తూ రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. సభ్యులు, విద్యార్థి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల గుర్తింపునకు సర్వే



గుడ్లవల్లేరు: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సమీపంలోని పాఠశాలలు, భవిత కేంద్రాలకు పంపాలని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్యా సమన్వయకర్త కె.ఏడుకొండలు తల్లిదండ్రులకు సూచించారు. 0-18 సంవత్సరాల దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు, నమోదు సర్వే కార్యక్రమాన్ని శనివారం గుడ్లవల్లేరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ప్రత్యేక అవసరాల పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సాధారణ పిల్లలతో కలిపి కూర్చోబెట్టడం ద్వారా ప్రత్యేక అవసరాలున్న పిల్లల్లో మేధోశక్తి, వికాసం పెరుగుతాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులందరూ పిల్లలను పాఠశాలలు, భవిత కేంద్రాలకు పంపాలని సూచించారు. ఎప్పటికప్పుడు ఫిజియోథెరపీ కేంద్రాలకు తీసుకెళ్లాలని, వారికి ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సర్వే, నమోదు వచ్చే నెల 9వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు వి.విజయకుమారి, అబ్దుల్ హమీద్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రహదారులు జలమయం



పోరంకిలో కురిసిన వర్షంతో జలమయంగా మారిన జాతీయ రహదారి

పెనమలూరు: మండలంలో శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఉక్కపోతతో ఉన్న వాతావరణం వర్షంతో ఒక్కసారిగా చల్లబడింది. నెల రోజులుగా ఎండ తీవ్రతతో జనాలు ఉక్కిరిబిక్కిరయ్యారు. అయితే మూడు రోజులుగా వాతావరణం మేఘావృతమై ఉన్నా వాన పడలేదు. దీంతో వాతావరణం మారి తీవ్ర ఉక్కపోతగా మారింది. శనివారం ఉదయం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మండలంలో కురిసింది. భారీ వర్షంతో విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై భారీగా వర్షం నీరు చేరి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వర్షం కురవడంతో సామాన్య ప్రజలతో పాటు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాగా గంగూరులో పిడుగుపాటుకు విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

రోడ్లపై వర్షపు నీరు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం పలు గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులపైకి వర్షపునీరు చేరుకుంది. రామవరప్పాడు బల్లెంవారి వీధి, అంకిత అపార్టుమెంట్ రోడ్డు, కాల్వగట్టు ప్రాంతం, ప్రసాదంపాడులో కానూరు వెళ్లు డొంక రోడ్డు, సెయింట్ ఆన్స్ పాఠశాల రోడ్డు, రైల్వేకట్ట ప్రాంతం, ఎనికేపాడు శివాలయం పల్లాలు, ఎస్సీ కాలనీ, విజయ ఆగ్రోకట్ట ప్రాంతాల్లో వర్షపునీరు చేరుకుంది. నిడమానూరులో రామానగర్, నెహ్రూనగర్, కాల్వగట్టు ప్రాంతాలు చిత్తడిగా మారాయి. జాతీయరహదారిపై భారీగా వర్షపునీరు చేరుకుంది. జాతీయరహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయిన్లు పొంగి వర్షపునీటికి మురుగునీరు తోడై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు స్పందించి వర్షపునీటిని బయటకు పంపించేందుకు చర్యలు తీసుకున్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు చల్లేందుకు అనువైన వర్షం

నున్న(విజయవాడరూరల్): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు పచ్చిరొట్ట విత్తనాలు చల్లేందుకు అనువైనవని విజయవాడ రూరల్ మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు తెలిపారు. వ్యవసాయ భూముల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉన్న రైతులు పచ్చిరొట్ట విత్తనాలను వెంటనే పొలాల్లో చల్లాలని పేర్కొన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు చల్లిన తర్వాత 35 నుంచి 40 రోజులకు పూత వస్తుందని తెలిపారు. ఈ సమయంలో రైతులు భూమిలో కలయదున్నాలని పేర్కొన్నారు. ఖరీఫ్‌లో వరి పండించే రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు సాగు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. విజయవాడ రూరల్ మండలంలోని రైతులు ఈ సూచనలు పాటించాలని ఆయన పేర్కొన్నారు.

ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా సహకరించండి

జిల్లా ఎన్నికల అధికారి బాలాజీ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేలా అభ్యర్థులు, ఏజెంట్లు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. శనివారం సాయంత్రం ఆయన తన చాంబర్‌లో పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏజెంట్లతో లెక్కింపు ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులకు ధన్యవాదాలు తెలిపారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని ఈ కార్యక్రమంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సహకరించాలన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని, అనంతరం ఏడు నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల్లో ఈవీఎంల ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో ఏమైనా ఓట్లు చెల్లుబాటు కాకపోతే తిరస్కరిస్తూ విడిగా పెట్టెలో ఉంచుతామన్నారు. 14 టేబుళ్లు ఏర్పాటుచేస్తున్నామని, ప్రతి టేబుల్‌కు అభ్యర్థుల తరఫున కౌంటింగ్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. రిటర్నింగ్ అధికారి వద్ద ఒక కౌంటింగ్ ఏజెంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఏజెంట్లు, అభ్యర్థులు ఓట్ల లెక్కింపు కేంద్రానికి జూన్ 4న ఉదయం 7 గంటలకు సంబంధిత రిటర్నింగ్ అధికారులకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు కోసం వచ్చే రాజకీయ పార్టీల నాయకులు, ఏజెంట్లు వారి వాహనాల కోసం ముందస్తుగా అనుమతి పత్రాలు పొందాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఏజెంట్లను కౌంటింగ్ హాలు నుంచి బయటకు పంపేందుకు రిటర్నింగ్ అధికారికి సర్వహక్కులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె. చంద్రశేఖరరావు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి షేక్ షాహెద్‌బాబు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దుర్గాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలి



మాట్లాడుతున్న సీఐ రామారావు

పెనమలూరు: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు పేర్కొన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు ముగిసినా ఎన్నికల నియమావళి అమలులో ఉందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు నిబంధనలు అతిక్రమించరాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు మంచి నేతను ఎన్నుకునేందుకు ఎన్నికలను ఎన్నికల కమిషన్ నిర్వహించిందని తెలిపారు. అంతేగాని ఎన్నికల సమయంలో స్వార్థంతో కక్షలు రేపి ఘర్షణలకు దిగరాదన్నారు. ముఖ్యంగా యువత గొడవలు చేయటంతో కేసుల్లో ఇరుక్కుంటారని, దీని వలన వారి భవిష్యత్తు అంధకారంగా మారుతుందని తెలిపారు. రెచ్చగొట్టే విధంగా ప్రెస్‌మీట్లు, సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు, ర్యాలీలు, డీజేలు పెట్టరాదన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గ్రామాల్లో జనాలు గుమిగూడరాదని పేర్కొన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు పోలీసులతో సహకరించాలని కోరారు.

నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

కంకిపాడు: ఎన్నికల నియామవళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీ శ్రీనివాసరావు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ముఖ్యులతో కంకిపాడులోని రాయల్ ఫంక్షన్ హాల్లో శనివారం సమావేశం నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అంతటా ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. 144 సెక్షన్, సెక్షన్ 30 అమలులో ఉంటాయన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అనుమతులు లేకుండా ర్యాలీలు, సమావేశాలు, సభలు నిర్వహించకూడదన్నారు. సమావేశంలో ఎస్ఐ డి.సందీప్, అదనపు ఎస్ఐ తాతాచార్యులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులు సహకరించాలి

పెనమలూరు: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండే విధంగా రాజకీయ పార్టీల నాయకులు పోలీసులతో సహకరించాలని పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు అన్నారు. పోరంకిలో శనివారం రాజకీయపార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన కౌంటింగ్ జరుగుతుందని, ఎన్నికల నియామవళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. సమావేశంలో ఎస్ఐలు వెంకటేశ్వరరావు, శేషకుమార్, ఉషారాణి, రమేష్ పాల్గొన్నారు.

30న ఉచిత వక్త శిక్షణ తరగతులు

గన్నవరం: గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం నెక్కల్లులో శ్రీరమణరావు ధ్యాన ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 30, 31 తేదీల్లో ఉచిత వక్త శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు స్టేప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ కే అశోక్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టూడెంట్స్, టీచర్స్, ఎడ్యుకేటెడ్ పేరెంట్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే ఈ తరగతులకు హాజరయ్యే వారికి ఉచిత భోజనం, వసతి సదుపాయలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మెటీరియల్‌తో పరిపూర్ణ శిక్షణ, సర్టిఫికెట్స్ అందజేయనున్నట్లు తెలిపారు. ఇతర సమాచారం కోసం 81217 31109లో సంప్రదించాలని కోరారు.

మల్లేశ్వరస్వామి ఆలయంలో పూర్ణాహుతి

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం పూర్ణాహుతి నిర్వహించారు. వేదపండితులు గుండెపూడి నాగరాజశేఖర్ శర్మ బ్రహ్మత్వంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఉదయం 8 గంటలకు స్వామివారి రుద్రాభిషేకం, అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, నిత్యహోమాలు, శ్రీ ఫలహోమం, చండీ హోమం, రుద్రహోమంతో, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం వసంతోత్సవం, చూర్ణోత్సవం నిర్వహించి అనంతరం అప్పగింతలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



పురుషోత్తపట్నం గ్రంథాలయంలో కంప్యూటర్‌పై విద్యార్థులకు అవగాహన



వణుకూరు గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



ఉయ్యూరులో కథల పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

గన్నవరం రూరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం పేర్కొన్నారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై శనివారం అవగాహన కల్పించారు. పురుషోత్తపట్నం గ్రామ సచివాలయం కార్యదర్శి ఈశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు కంప్యూటర్ సేవలపై పట్టు సాధించటం అవసరమన్నారు. ప్రస్తుతం ప్రతిచోటా డిజిటల్ సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే కాలంలో పూర్తిగా కంప్యూటర్‌పై అందరం ఆధారపడాల్సి ఉందన్నారు. కాబట్టి ఈ సమ్మర్ క్యాంపులో కంప్యూటర్‌పై విద్యార్థులకు అవగాహన నిర్వహించటం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ శాఖ వేసవి విజ్ఞాన శిబిరాలు ఏర్పాటు చేయటం గొప్ప విషయమన్నారు.

● ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి పర్యవేక్షణలో సమ్మర్ క్యాంప్ శనివారం జరిగింది. విశ్రాంత ఉపాధ్యాయురాలు కృష్ణకుమారి పాల్గొని భగవద్గీత శ్లోకాలు వివరించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు, నీతి కథలు పోటీలను నిర్వహించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

పెనమలూరు: వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా వణుకూరు గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. తొలుత విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం పిల్లలతో కథలు చెప్పించటం, పాటలు పాడించారు. విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో మానసిక ఆనందం పెంపొందించేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని గ్రంథాలయ అధికారి భారతి తెలిపారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: ఉయ్యూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థులకు శనివారం చిత్రలేఖనం, కథల పోటీలు నిర్వహించారు. ఆయా అంశాలపై ఉపాధ్యాయని శిరీష విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు.

సమాజ అభ్యున్నతికి కృషి



దిరిశం ప్రభాకర్‌రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఐఆర్ఎస్ సుధాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పద్మజ్యోతి

ఉయ్యూరు: దిరిశం చారిటబుల్ ట్రస్టు ద్వారా సమాజ అభ్యున్నతికి కృషి చేస్తున్నామని ఐఆర్ఎస్ (ఇన్‌కంట్యాక్స్ కమిషనర్) దిరిశం సుధాకర్‌రావు అన్నారు. ఉయ్యూరు ఎస్సీ కాలనీలో ఉయ్యూరు సమితి మాజీ అధ్యక్షుడు దిరిశం ప్రభాకర్‌రావు వర్ధంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రభాకర్‌రావు విగ్రహానికి సుధాకర్‌రావు, తిరువూరు మాజీ ఎమ్మెల్యే దిరిశం పద్మజ్యోతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐఆర్ఎస్ సుధాకర్‌రావు మాట్లాడుతూ తన తల్లిదండ్రులు ప్రభాకర్‌రావు, సరోజిని జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో దిరిశం చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రస్టు ద్వారా ఉయ్యూరు ప్రాంతంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా సామాజిక సేవే పరమావధిగా సేవా కార్యక్రమాలను విస్తృత పరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, ప్రజాసంఘాల బాధ్యులు పినమాల నాగకుమార్, ఎన్‌వైఎస్ గుప్తా, ఎంజి రవి, మట్టా హనోక్, ఈడ్పుగంటి రాజా, మట్టా జగన్, ఈడ్పుగంటి డేవిడ్, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థుల వసతి గృహానికి అద్దె భవనం అవసరం

పెనమలూరు: పెనమలూరులో ప్రభుత్వ బీసీ కళాశాల బాలురు, బాలికలకు సంక్షేమ వసతి గృహం ఏర్పాటు చేసేందుకు అద్దె భవనం కావాలని వసతి గృహ సంక్షేమ అధికారి సీహెచ్.కనక సాహిత్య శనివారం తెలిపారు. 2024-2025 విద్యా సంవత్సరానికి పెనమలూరులో ప్రభుత్వ బీసీ కళాశాల బాలురు, బాలికలకు వసతి గృహం గృహం ఏర్పాటు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఇందు కోసం ప్రైవేటు భవనంలో వసతి గృహం ఏర్పాటుకు ఉన్నతాధికారులు అనుమతించారని తెలిపారు. ఆసక్తి కలిగిన భవన యజమానులు అద్దె ప్రాతిపదికన వసతి గృహం ఏర్పాటుకు ముందుకు వచ్చి భవనం అద్దెకు ఇవ్వాలని కోరారు. ఆసక్తి కలిగిన భవన యజమానులు సహాయ వెనుకబడిన సంక్షేమ అధికారి విజయ్‌కుమార్ ఫోన్ నంబర్ 99498 82234, పెనమలూరు వసతి గృహ సంక్షేమ అధికారి 91213 49616కు ఫోన్ చేసి సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

పచ్చరొట్ట పైర్ల సాగుతో భూమి సారవంతం

పామర్రు: రబీ సాగు అనంతరం పొలాల్లో పచ్చిరొట్టపైరులను పెంచడం వలన భూసారాన్ని పెంచుకుని తద్వారా రసాయని ఎరువులను తగ్గించుకోవచ్చని పామర్రు ఏడీఏ స్వర్ణలత వెల్లడించారు. శనివారం ఆమె మాట్లాడుతూ విచక్షణ రహితంగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గిపోతుందన్నారు. జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, నీలి, ఆడవి నీలిలను పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలన్నారు. పూత దశ వరకూ పెంచి భూమిలో కలియదున్నాలని చెప్పారు. పచ్చి రొట్ట పైర్లలో స్థూల పోషకాలైన నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం వరకు ఉంటుంది. భాస్వరం 0.1 శాతం నుంచి 3.5 శాతం వరకు ఉంటుంది. భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం వరకు పొటాషియం 0.5 శాతం నుంచి 2.0 శాతం వరకు ఉంటాయి. వీటితో పాటు సూక్ష్మ పోషకాలు కూడా ఉంటాయి. పంట ఎదుగుదల, దిగుబడికి ఈ మూడు పోషకాలు ఉండటం వల్ల రసాయన ఎరువులు పెద్దగా వేయాల్సిన అవసరం ఉండదు. 30 శాతం వరకూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. ఈ నేపథ్యంలో పచ్చిరొట్ట ఎరువులు వేయడం ఎంతో మేలని సూచిస్తున్నారు. పచ్చిరొట్ట సాగు చేయడం వల్ల భూమి లోపల పొరలలో నిక్షిప్తమైన పోషకాలను వెలికి తెచ్చి లభ్య రూపంలో పంట మొక్కలకు అందిస్తాయి. భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతుంది. కలుపు మొక్కలు నాశనమవుతాయి. అందువల్ల రైతులందరూ పచ్చిరొట్ట పైర్లను సాగు చేయడం మంచిదని ఏడీఏ స్వర్ణలత సూచిస్తున్నారు.

ఐఎఫ్ఎస్ సాధించిన కృష్ణ చైతన్యకు ఘన సన్మానం



ఐఎఫ్ఎస్‌కు ఎంపికైన తుమ్మల కృష్ణ చైతన్య దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: యూపీఎస్సీ నిర్వహించిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్-2023లో జాతీయ స్థాయిలో 74వ ర్యాంకు సాధించిన బాపులపాడు మండలం రంగన్నగూడెంకు చెందిన తుమ్మల కృష్ణ చైతన్యకు స్వగ్రామంలో శనివారం ఘన సన్మానం నిర్వహించారు. రంగన్నగూడెం రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామంలోని కమ్యూనిటీ హాల్లో కృష్ణ చైతన్య దంపతులను ఘనంగా సత్కరించారు. పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రైతు కుటుంబానికి చెందిన తుమ్మల కృష్ణ చైతన్య ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) సాధించటం అభినందనీయమన్నారు. కృష్ణ చైతన్య స్ఫూర్తితో గ్రామంలోని యువకులు యూపీఎస్సీ, సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఐఎఫ్ఎస్‌కు ఎంపిక అయినప్పటికీ సివిల్ సర్వీసెస్ సాధించాలనే పట్టుదలతో కృషి చేస్తున్నట్లుగా తెలిపారు. నేర్చుకోవాలనే తపన, సాధించాలనే దృఢ సంకల్పంతో పాటుగా అనుభవజ్ఞులు సూచనలు తోడైతే ఏ రంగంలోనైనా తప్పక విజయం సాధించవచ్చని తెలిపారు. ఏపీ సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, హనుమాన్ కో-ఆపరేటివ్ షుగర్స్ మాజీ చైర్మన్ గుండపనేని ఉమావరప్రసాద్, సర్పంచ్ రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, పాల సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, రంగన్నగూడెం రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ దశరథరామయ్య పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో సీఐ టీవీవీ రామారావు ఆధ్వర్యంలో దాడి చేయగా ఒక వ్యక్తి పట్టుబడ్డాడు. మరో నలుగురు వ్యక్తులు పరారయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరు శివారులో ఇళ్ల ప్లాట్‌లలో కొందరు గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో సీఐ రామారావు సిబ్బందితో కలసి దాడి చేశారు. కంకిపాడు మండలం పునాదిపాడుకు చెందిన గజ్జలకొండ సాయిప్రసన్నకుమార్ పట్టుబడగా అదే గ్రామానికి చెందిన మరో నలుగురు జి.కల్యాణ్ బాబు, బొడ్డు ఉమేష్‌ఖాన్, అయ్యంకి చందు, తిరుమలకొండ వేణు పరారయ్యారు. సాయిప్రసన్నకుమార్ వద్ద 1800 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రెండు బైక్‌లు, ఐదుసెల్ ఫోన్‌లు, రూ.వెయ్యి నగదు కూడా స్వాధీనం చేసుకున్నారు. సాయిప్రసన్నకుమార్‌ను అరెస్టు చేశారు.

హనుమజ్జయంతి ఉత్సవాలకు ముస్తాబు



దేవస్థానం వద్ద విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన ముఖ ద్వారం

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమజ్జయంతి ఉత్సవాలకు హనుమాన్‌జంక్షన్ ముస్తాబు అవుతోంది. ఈ నెల 27వ తేదీ నుంచి జూన్ ఒకటో తేది వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే అభయాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో ప్రత్యేకంగా పందిళ్లు, ఉత్సవ మండపం నిర్మించారు. అంతేకాక ఆలయాన్ని, హనుమాన్ జంక్షన్ కూడలి, ప్రధాన రహదారులను విద్యుత్ దీపాలు, దేవతామూర్తుల ప్రతిమలతో అలంకరించారు. ఏటా మాదిరిగా హనుజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అభయాంజనేయునికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేగాక ఉత్సవ వేదికపై ప్రతిరోజు భజనలు, హనుమాన్ చాలీసా పారాయణం, అధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

మహిళపై దాడి చేసిన బంధువులపై కేసు నమోదు

పెనమలూరు: మహిళపై దాడి చేసిన బంధువులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు కథనం మేరకు తాడిగడప ఎల్‌వీగార్డెన్స్‌లో మహమ్మద్ అజ్మత్, భర్త ముజీబ్ కుటుంబం సభ్యులతో ఉంటోంది. అజ్మత్ విజయవాడలో ప్రైవేటు సెక్యూరిటీ మేనేజర్‌గా పని చేస్తోంది. ఆమెకు నలుగురు మరుదులు, ఇద్దరు ఆడపడుచులు ఉన్నారు. కాగా అజ్మత్ అత్త సర్దార్‌బేగం ఆమె చిన్న కొడుకు అబ్దుల్లా వద్ద గంగూరులో ఉంటుంది. అనారోగ్య కారణాలతో ఆమె ఈ నెల 22వ తేదీ రాత్రి మృతి చెందింది. ఈ సమాచారం తెలుసుకున్న అజ్మత్ కుటుంబ సభ్యులతోకలిసి గంగూరుకు వెళ్లింది. అక్కడ మరుదులు అబ్దుల్లా, ఆదిల్, ఆరీఫ్, ఆడపడుచు తస్లిమా తగాదాపడి అజ్మత్‌పై దాడి చేశారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

వ్యాన్ల డ్రైవర్లకు జీతాలు చెల్లించాలని వినతి



కమిషనర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న వ్యాన్ల డ్రైవర్లు

పెనమలూరు: చెత్త తరలించే వ్యాన్ల డ్రైవర్లకు జీతాలు చెల్లించాలని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్‌కు ఎం.వెంకటేశ్వరరావుకు డ్రైవర్లు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకుడు త్రిమూర్తి మాట్లాడుతూ కార్మికులకు చెత్త తరలించే వాహన ప్రైవేటు యాజమాన్యం సకాలంలో జీతాలు చెల్లించక పోవడంతో డ్రైవర్లు సమ్మె బాట పట్టారన్నారు. ఏజెన్సీ సకాలంలో జీతాలు చెల్లించి, వ్యాన్ మరమ్మతు బాధ్యత వారే తీసుకోవాలన్నారు. డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వాహనాలు నిర్వహణ చేస్తున్న ప్రైవేటు ఏజెన్సీకి తాడిగడప మున్సిపాలటీ బకాయి లేదన్నారు. డ్రైవర్లు ఇప్పటికైనా విధుల్లో చేరితే జీతాలు చెల్లింపులో బకాయి లేకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.